సాక్షి
నాగర్‌కర్నూల్
శుక్రవారం । 25 । జూలై । 2025



శ్రావణం.. శుభకరం
పండుగల ప్రత్యేకం శ్రావణమాసం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది.

వివరాలు 8లో ▸



జూరాలకు తగ్గిన వరద
జూరాల జలాశయానికి గురువారం ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గింది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
28.1 /20.0

వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అప్పుడప్పుడు ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మొక్కజొన్న పంట పరిశీలన



బిజినేపల్లి: మండలంలోని వట్టెం గ్రామానికి చెందిన రైతులు మామిళ్ల శ్రీను, భీమయ్య సాగు చేసిన మొక్కజొన్న పంట ఎండిపోవడంతో పాలెం శాస్త్రవేత్తలు గురువారం సాయంత్రం పరిశీలించారు. కొద్ది రోజుల కింద గడ్డి మందు పిచికారీ చేస్తే మొక్కజొన్న పంట ఎండిపోయిందని రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై అధికారులు పంటను క్షేత్రస్థాయిలో సందర్శించి శాస్త్రవేత్తలకు సమాచారం అందించారు. గురువారం శాస్త్రవేత్తలు శశిభూషణ్, చరణ్‌తేజ్ ఎండిన పంటను పరిశీలించి, మొక్కల నమూనాలు సేకరించారు. వాటిని ల్యాబ్‌లో పరీక్షించి నివేదిక అందజేస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ కమల్‌కుమార్, ఏఈఓ భార్గవ్ ఉన్నారు.

నేడు పెన్షన్ అదాలత్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పెన్షనర్లు, జీపీఎఫ్, అకౌంట్ సంబంధిత పెండింగ్ సమస్యలపై శుక్రవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పెన్షన్ అదాలత్, వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ జిల్లా స్థాయిలో పెన్షన్ కమిటీల ద్వారా పెండింగ్ పెన్షన్ కేసులు త్వరితగతిన పరిష్కరించడానికి వీలుగా కలెక్టర్ల సమన్వయంతో పెన్షన్ అదాలత్, వర్కర్‌షాప్ నిర్వహించాలని ఆదేశించారన్నారు. మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలకు సంబంధించి దీర్ఘకాలిక పెన్షన్ కేసుల పరిష్కారంపై ఈ వర్క్‌షాప్ కొనసాగుతుందన్నారు. అలాగే పెన్షన్ చెల్లింపు ఆర్డర్లు, పీపీఓ, పీజీఎఫ్ అధికారాలు కూడా పంపిణీ చేస్తారన్నారు.

చైల్డ్ లేబర్ యాక్ట్ కేసులపై డీఎస్పీ విచారణ



బిజినేపల్లి : మండల కేంద్రంలో ఆయా వ్యాపార దుకాణ యజమానులపై చైల్డ్ లేబర్ యాక్ట్ కింద నమోదైన కేసులను డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్ గురువారం విచారించారు. కొద్ది రోజుల కింద ప్రత్యేక సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రెండు దుకాణాల్లో మైనర్లు పనిచేస్తుండగా పట్టుబడ్డారు. దీంతో ఆయా దుకాణదారులపై కేసులు నమోదు చేసి డీఎస్పీ విచారించారు. ఎస్‌ఐ శ్రీనివాస్‌యాదవ్, సిబ్బంది ఉన్నారు.

ఓపెన్ ఇంటర్, పది పరీక్ష ఫీజు చెల్లించండి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓపెన్ ఇంటర్, ఎస్సెస్సీ ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ ఫీజులు చెల్లించాలని డీఈఓ ప్రవీణ్‌కుమార్, టాస్క్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ శివయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పరీక్ష రాసి ఫెయిలైన వారు, అడ్మిషన్ పొంది పరీక్ష రాయలేని వారు ఫీజు చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 28 నుంచి వచ్చే నెల 5 వరకు చెల్లించాలని, అపరాధ రుసుంతో వచ్చే నెల 6 నుంచి 10 వరకు ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. పరీక్ష సెప్టెంబర్ 22 నుంచి 29 వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు

పాలమూరు: చిన్న వయస్సులో బాల్య వివాహం చేసుకోవడం వల్ల అమ్మాయిలకు అనారోగ్య సమస్యలతోపాటు చట్టపరమైన సమస్యలు ఎదువుతాయనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర అన్నారు. జిల్లాకేంద్రంలోని జలజం జూనియర్ కళాశాలలో గురువారం చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి న్యాయమూర్తి హాజరై డ్రగ్స్, ఇల్లిసిట్ ట్రాఫికింగ్, బాలల హక్కులు, విద్యాహక్కు, పోక్సో యాక్ట్, ర్యాగింగ్ నిషేధ చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవడం వల్ల భవిష్యత్‌లో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మనకు కావాల్సిన న్యాయంపై ఎవరికి వారు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు.

ఉన్నత విద్య మిథ్య..!



కొండనాగులలోని ఉమామహేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల

- జిల్లాలో కానరాని పాలిటెక్నిక్, పీజీ, మహిళా డిగ్రీ కళాశాలలు
- లక్ష్యానికి దూరమవుతున్న విద్యార్థులు
- నెరవేరని ప్రజాప్రతినిధుల హామీలు
- విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని పలువురి డిమాండ్

అచ్చంపేట: జీవితంలో త్వరగా స్థిరపడాలనుకునే వారికి సాంకేతిక విద్య చక్కని దిక్సూచి. కానీ నాగర్‌కర్నూల్ జిల్లాలో కల్వకుర్తి, మన్ననూర్ ఐటీఐ కళాశాల మినహా మరెక్కడా ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ, పాలిటెక్నిక్, మహిళా డిగ్రీ కళాశాలలు లేకపోవడంతో విద్యారంగంలో వెనుకబడిన తీరుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐటీఐ), పాలిటెక్నిక్, నర్సింగ్ కోర్సుల ద్వారా విద్యార్థులు తక్కువ సమయంలోనే ఉద్యోగావకాశాలు పొందే అవకాశం ఉంది. కానీ కోర్సులను చదవాలంటే దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలగానే..

నల్లమల ప్రాంతంలో పీజీ, సాంకేతిక విద్యను అందుబాటులోకి తెస్తామన్న ప్రజాప్రతినిధుల హామీలు బుట్టదాఖలయ్యాయి. మాజీ మంత్రి మహేంద్రనాథ్ హయాంలో విద్యపరంగా నల్లమలకు కొంత మేలు జరిగింది. అచ్చంపేటలో మహిళా డిగ్రీ కళాశాల, పీజీ కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పిన నాయకుల మాటలు నీటి మూటలు మిగిలిపోతున్నాయి. బల్మూర్ మండలం కొండనాగులలో ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అమ్రాబాద్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. అచ్చంపేట పట్టణంలో ప్రగతి, చైతన్య, త్రివేణి ప్రైవేటు డిగ్రీ కళాశాలలున్నా ఆర్థిక ఇబ్బందుల కారణంగా పేద విద్యార్థులు అందులో చదవలేకపోతున్నారు. అచ్చంపేటకు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండనాగుల, 23 కిలో మీటర్ల దూరంలో అమ్రాబాద్‌కు ఉప్పునుంతల, అచ్చంపేట, లింగాల మండలాల విద్యార్థులు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొని కొండనాగుల, అమ్రాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివినా.. విద్యార్థులు పీజీకి సుదూర ప్రాంతాలకు వెళ్లలేక ఉన్నత విద్యకు దూరమవుతున్నారు.

మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటుకు..

అచ్చంపేటలో ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలు, గురుకుల జూనియర్ కళాశాలతో పాటు మూడు ప్రైవేటు జూనియర్ కళాశాలు ఉన్నాయి. కొండనాగుల, అమ్రాబాద్, వంగూర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, లింగాల, మన్ననూర్‌లో గురుకుల జూనియర్ కళాశాలల్లో ఎంత మంది విద్యార్థులు ప్రతియేటా ఇంటర్ పూర్తి చేస్తున్నారు. అచ్చంపేటలో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎంతో కాలంగా డిమాండ్ ఉన్నా అది నెరవేరడం లేదు. 2005లో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని నాటి, నేటి ఎమ్మెల్యే వంశీకృష్ణ స్పష్టం చేసినా నేటికీ కార్యరూపం దాల్చలేదు.

జిల్లా విద్యార్థులకు ఆటంకం

జిల్లాలో 2024–25 విద్యా సంవత్సరానికిగాను 10,196 మంది విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణత సాధించారు. వారందరికీ సాంకేతిక కోర్సుల్లో చేరడానికి అర్హత ఉంటుంది. వీరితో పాటు ఇంటర్ చదివిన విద్యార్థులు సైతం ఈ కోర్సుల్లో చేరొచ్చు. ఉమ్మడి జిల్లాలో వనపర్తి, మహబుబ్‌నగర్, గద్వాల వంటి ప్రాంతాల్లో పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలు ఉన్నప్పటికీ దూరభారంతో పాటు సీట్లు కూడా సరిపోక నాగర్‌కర్నూల్ జిల్లా విద్యార్థులకు అనుకున్న స్థాయిలో అవకాశాలు దక్కడం లేదు.

విద్యారంగం అభివృద్ధి చెందాలి



విద్యారంగంలో అత్యంత వెనుకబడిన జిల్లాను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం జిల్లాలో ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ కళాశాలలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను ప్రారంభించాలి. జిల్లాలో సాంకేతిక కళాశాలల ఏర్పాటు కోసం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పలుమార్లు ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కళాశాల సాధనకు విద్యార్థి సంఘాలు అన్ని ఏకమై దశల వారీగా ఉద్యమాలు చేపడుతాం.

– ఎద్ల మారుతి,
డీవీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు

సాంకేతిక విద్య అందించాలి



అచ్చంపేట నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అధికంగా ఉన్నారు. వెనకబడిన అచ్చంపేటలో ఐటీఐ, పాలిటెక్నిక్, పీజీ, నర్సింగ్‌కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి. సాంకేతిక విద్య అందక విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు పొందట్లేదు. ప్రభుత్వం గుర్తించి ఇక్కడ కళాశాలలు ఏర్పాటు చేయాలి.

– సయ్యద్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు

విద్యాభివృద్ధికి కృషి



నల్లమల ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకొచ్చి నాణ్యమైన విద్య అందిస్తాం. మహిళా డిగ్రీ కళాశాల, పీజీ, పాలిటెక్నిక్, నర్సింగ్ కళాశాలలు, ఆయుర్వేద కళాశాలను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరాం. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఏజెన్సీ ప్రాంతామైన అచ్చంపేటను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతాం.

– డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ,
ఎమ్మెల్యే, అచ్చంపేట

'అంకితభావంతో పనిచేస్తేనే గౌరవం'



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

కల్వకుర్తి టౌన్: పోలీసులు అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రజల్లో గౌరవం పెరుగుతుందని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. గురువారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా రిసెప్షన్, ఫిర్యాదుదారుల రిజిస్టర్, లాకప్ రూంను పరిశీలించారు. అందుకు సంబంధించిన రిజిస్టర్, వాచ్ డ్యూటీలో ఉన్న సిబ్బందితో వివరాలను ఆరా తీసి, వారికి పలు సూచనలు చేశారు. డ్యూటీలో ఉన్న సమయంలో ప్రతి ఒక్క పోలీస్ సిబ్బంది తప్పనిసరిగా డ్రెస్ కోడ్‌ను పాటించాలని ఆదేశించారు. ఎస్పీ వచ్చిన సమయంలో పలువురు సిబ్బంది డ్రెస్ కోడ్‌తో పాటుగా, నేమ్ బ్యాడ్జీలను ధరించకపోవటంతో మరోమారు ఇలాంటి తప్పులను చేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అనంతరం ఎస్‌ఐ చాంబర్‌లో పలు కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన ఆయన, ఇటీవల పట్టణంలోని జరిగిన వరుస దొంగతనాలపై విచారణ జరిగే తీరును డీఎస్పీ వెంకట్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రాత్రి సమయంలో పెట్రోలింగ్ పెంచాలని, ప్రజల భద్రతను పరిరక్షించాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పరిసరాలను గమనించి, వానాకాలం కావటంతో ఆవరణలో పిచ్చిమొక్కలు పెరగకుండా పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఎస్పీ వెంట కల్వకుర్తి సీఐ నాగార్జున, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

- అదనపు ఎస్పీ రామేశ్వర్



అవగాహన సదస్సుకు హాజరైన అదనపు ఎస్పీ రామేశ్వర్, అధికారులు

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని, అప్పుడే ఉన్నత స్థానాలు అధిరోహిస్తారని అదనపు ఎస్పీ రామేశ్వర్ అన్నారు. , మహిళలతో అనుచితంగా ప్రవర్తించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో నర్సింగ్ కళాశాల విద్యార్థినులకు షీ టీం, సఖీ సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు ఎస్పీ మాట్లాడుతూ మహిళలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుంటూ.. అన్ని రంగాల్లో సత్తా చాటాలని సూచించారు. మహిళలు పనిచేసే ప్రదేశాల్లో లైగింక వేధింపులు, ఉమెన్ ట్రాఫికింగ్, ఈవ్ టీజింగ్‌లపై నిరంతరం నిఘా ఉంచుతున్నామని తెలిపారు. ఎవరైనా మహిళలను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, దాడికి పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు.

సమయాన్ని వృథా చేయొద్దు

సామాజిక మాధ్యమాల ద్వారా విద్యార్థులు ఎక్కువగా తమ సమయాన్ని వృథా చేసుకోవడమే కాకుండా అపరిచిత వ్యక్తుల ద్వారా మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులు ఆలస్యం చేయకుండా డయల్ 100, 87126 57676 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలపాలని కోరారు. సఖీ సెంటర్ అడ్మిన్ సునీత మాట్లాడుతూ మహిళలు ఎవరైనా గృహహింస, శారీరకంగా, మానసికంగా ఏమైనా హింసకు లోనైతే జిల్లా కేంద్రంలోని సఖీ సెంటర్‌ను సంప్రదిస్తే వారికి కావాల్సిన కౌన్సిలింగ్, న్యాయపరమైన, పోలీసు సహాయం అందిస్తామన్నారు. నిస్సాహయ స్థితిలో ఉంటే హెల్ప్ లైన్ నంబర్ 181, 99519 40181 ఫోన్ చేసి ఫిర్యాదు చేసి సిబ్బంది స్పందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీఐ శంకర్, జిల్లా షీ టీం ఇన్‌చార్జి ఏఎస్‌ఐ విజయలక్ష్మి, షీ టీం సభ్యుడు వెంకటయ్య పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ గోదాంలో అధికారుల తనిఖీలు



గోదాంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని సివిల్ సప్లై గోదాంలో విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ వెంకటేశం ఆధ్వర్యంలో పలువురు అధికారులు గోదాంలోని స్టాక్, రిజిస్టర్లను పరిశీలించారు. స్టాక్‌లో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించిన అధికారులు రేషన్ డీలర్లు, వసతిగృహ ఇన్‌చార్జీలు, ఐసీడీఎస్ అధికారులకు ఫోన్లు చేసి స్టాక్ తీసుకున్నారా? లేదా..? అనే విషయంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. వర్షాకాలం సంభవించే ప్రకృతి విపత్తులను దృష్టిలో ఉంచుకొని వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం సూచన మేరకు మూడు నెలల రేషన్ బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిందని తెలిపారు. ఇందులో భాగంగా రేషన్ బియ్యం పంపిణీపై ప్రభుత్వం నిఘాను ఏర్పాటు చేసి, రాష్ట్ర, జిల్లా అధికారులను సమాయత్తం చేసిందని పేర్కొన్నారు. ఇప్పటికే మూడు నెలలకు సంబంధించి అన్ని రేషన్ షాపుల నుంచి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పండరి, ఎస్‌ఐ సాంబశివరావు, గోదాం ఇన్‌చార్జీ మోతిలాల్ పాల్గొన్నారు.

'స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం'



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆచారి

కల్వకుర్తి రూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతి కార్యకర్త ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి కోరారు. గురువారం పట్టణంలో మండల పార్టీ అధ్యక్షుడు నరేష్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఎన్నికల కార్యశాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించడంతో పాటు ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రతిరోజు ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్, బండేల రామచంద్రా రెడ్డి, నర్సిరెడ్డి, కిష్టారెడ్డి, శ్యామ్, సురేందర్ గౌడ్, శ్రీశైలం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

27న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ జట్టు ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: వరంగల్‌లో వచ్చేనెల 3, 4 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే (అండర్–14, 16, 18, 20) బాలబాలికలు, పురుష, మహిళా క్రీడాకారుల ఎంపికలను ఈనెల 27వ తేదీన జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శరత్‌చంద్ర గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.. ఉదయం 9 గంటలకు అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహిస్తామని, ఆసక్తి గల క్రీడాకారులు ఎస్‌ఎస్‌సీ మెమో, తహసీల్దార్ ద్వారా కుల ధ్రువపత్రం, జనన ధ్రువపత్రాలతో రిపోర్ట్ చేయాలని కోరారు.

పాలమూరులో పోకిరీలు

ఉమ్మడి జిల్లాలో ఏటా పెరుగుతున్న పోక్సో కేసులు

'మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు కొన్నిరోజుల నుంచి పదో తరగతి విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. దీంతో ఈ నెల 4న విద్యార్థులు షీటీం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో పాఠశాలను పరిశీలించి జరిగిన ఘటనపై విచారణ చేయగా ఉపాధ్యాయుడు తప్పగా ప్రవర్తించినట్లు తేలింది. దీంతో సదరు ఉపాధ్యాయుడిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేశారు.'

మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలికపై జీలకరపురం కృష్ణయ్య లైంగిక దాడి చేయడంతో 376(2) ఐపీసీతో పాటు పోక్సో యాక్ట్ కింద కేసులు నమోదయ్యాయి. దీనిపై చార్జీషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపరచగా ఈ నెల 17న ప్రత్యేక సెషన్స్ కోర్టు న్యాయమూర్తి నిందితుడు కృష్ణయ్యకు జీవితఖైదుతోపాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.



మహబూబ్‌నగర్‌లో రక్షణ చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

- ఆందోళన కలిగిస్తున్న అఘాయిత్యాలు
- కీచకులుగా మారుతున్న పలువురు ఉపాధ్యాయులు
- పాఠశాలల్లోనూ విద్యార్థినులపై లైంగిక దాడులు
- నాలుగేళ్లలో 1,412 కేసులు నమోదు

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లాలో రోజురోజుకూ పాఠశాలలు, కళాశాలలకు వెళ్తున్న బాలికలు, అమ్మాయిలపై వేధింపులు పెరుగుతున్నాయి. దీనికి కారకులపై కూడా పోక్సో కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నాయి. అమ్మాయిలను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిలో మైనర్ అబ్బాయిలు కూడా ఎక్కువగానే ఉన్నారు. ఇంట్లో తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకుండా జులాయిగా తిరిగే కొందరు యువకులే ఎక్కువగా ఇలాంటి చేష్టలకు పాల్పడుతున్నారు. కొందరు అయితే పనిగట్టుకొని పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం, వదిలే సమయానికి బైక్‌లపై ఉంటూ వచ్చిపోయే వారిని టీజ్ చేయడం సర్వసాధారణంగా మారింది. అయితే కొందరు బాధితులు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదులు చేస్తుంటే.. మరికొందరు సర్దుకుపోతున్నారు. ఇలాంటి వారిని అలుసుగా తీసుకొని కొందరు యువకులు మరింత రెచ్చిపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో 2022 నుంచి 1,412 పోక్సో కేసులు నమోదయ్యాయి. అందులో అత్యధికంగా మహబూబ్‌నగర్‌లో 451, నాగర్‌కర్నూల్‌లో 327, గద్వాలలో 234, నారాయణపేటలో 211, వనపర్తిలో 189 కేసులున్నాయి.

నిత్యం తనిఖీలు చేస్తే..

మహిళా, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని బాలల పరిరక్షణ, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలోని షీటీం బృందాలు తనిఖీలు చేపడుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఈ తనిఖీలు మరింతగా పెరగాలి. ముఖ్యంగా బాలికల హక్కుల పరిరక్షణతో పాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలపై నిత్యం తనిఖీలు చేయడం చాలా అవసరం. వసతి గృహాలు, పాఠశాలలు, గురుకులాలకు వెళ్లి చిన్నారులు తమ బాధలు చెప్పుకొనే అవకాశం ఇవ్వాలి. ఎక్కడైనా అనుమానంగా అనిపించినా.. బాలికలకు సరైన రక్షణ అందని పరిస్థితులను గుర్తించినా తగు చర్యలు తీసుకోవాలి.

చిన్నప్పటి నుంచే..

- లైంగిక వేధింపుల గురించి పిల్లలకు చిన్నప్పటి నుంచే అవగాహన కల్పించాలి.
- వేధింపులకు గురైతే ఎవరి సహాయం కోరాలి.. ఎలా స్పందించాలో వివరంగా చెప్పాలి.
- ఒంటరిగా ఎక్కడికీ వెళ్లొదని, వెళ్లినప్పుడు ఎలా జాగ్రత్తగా ఉండాలో వివరించాలి.
- శరీరంలోని ఏ భాగాలను ఇతరులు తాకకూడదనే విషయాన్ని వారికి అర్థమయ్యేలా చెప్పాలి.
- ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే ముట్టొద్దు అని గట్టిగా అరవడం, అక్కడి నుంచి పారిపోవడం, ఎదురించడం వంటివి తెలియజెప్పాలి.

2022 నుంచి ఉమ్మడి జిల్లాలో నమోదైన పోక్సో కేసులు

జిల్లా	నమోదైన కేసులు			
	2022	2023	2024	2025 (జూన్)
మహబూబ్‌నగర్	133	116	133	69
వనపర్తి	47	46	54	42
జోగుళాంబ గద్వాల	74	73	51	36
నాగర్‌కర్నూల్	86	91	105	45
నారాయణపేట	50	42	80	39

బాలికలకు అండగా..

- చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, డయల్ 100 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.
- షీటీంకు ఫిర్యాదు చేయాల్సిన నం.87126 59365, భరోసాకు ఫిర్యాదు చేయాల్సిన నం .87126 59280
- భరోసా సెంటర్‌లో మైనర్లకు రక్షణతోపాటు న్యాయం అందుతుంది.
- మహిళా, శిశు సంక్షేమ శాఖలోని చిన్నారుల సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ) సహాయం పొందవచ్చు.
- లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం -2012 (పోక్సో) కఠిన శిక్షలు పడేలా చేస్తోంది.
- సఖి సెంటర్ ద్వారా అన్యాయానికి గురైన చిన్నారులు, అమ్మాయిలకు ప్రత్యేక వసతి, రక్షణతో,పాటు కౌన్సిలింగ్ నిర్వహిస్తారు.
- మహబూబ్‌నగర్ జిల్లా షీటీం విభాగానికి నెల రోజుల్లో 27 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో ఇద్దరికి కౌన్సిలింగ్ ఇవ్వగా.. 25 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..

జిల్లాలో షీటీం బృందాలు విద్యార్థినులు, అమ్మాయిలను వేధిస్తున్న ఆకతాయిలను అదుపులోకి తీసుకుని వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. ఘటనలు తీవ్రంగా ఉంటే కేసులు నమోదు చేస్తున్నాం. అన్ని రకాల పాఠశాలల్లో పోక్సో, అమ్మాయిల రక్షణ, గుడ్ టచ్- బ్యాడ్ టచ్, ఈవ్ టీజింగ్ వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నాం. అమ్మాయిలు సెల్ఫ్ కాన్ఫిడెన్స్, సెల్ఫ్ డిఫెన్స్ వంటివి మెరుగుపరుచుకోవాలి. సోషల్ మీడియా వల్ల జరుగుతున్న నష్టాలపై చైతన్యం చేస్తున్నాం.

– జానకి, ఎస్పీ, మహబూబ్‌నగర్

అండగా సఖి కేంద్రం..

వివిధ రూపాల్లో దాడులకు గురైన మహిళలకు సఖి కేంద్రం అండగా ఉంటుంది. మైనర్లపై అత్యాచారాలు, లైంగిక దాడులు, పరువు హత్యలు, యాసిడ్ దాడులు, వరకట్నం వంటి అన్ని రకాల వేధింపుల నుంచి రక్షించడానికి కృషి చేస్తోంది. 18 ఏళ్ల లోపు బాలికలతో పాటు మహిళలకు ఏదైనా సమస్య వస్తే సఖి కేంద్రాన్ని ఆశ్రయిస్తారు. అలాగే టోల్‌ఫ్రీ నం.181కు ఫోన్ చేసి సమస్యను చెప్పవచ్చు.

– సౌజన్య, సఖి కేంద్రం కో–ఆర్డినేటర్, మహబూబ్‌నగర్

క్లుప్తంగా

అనారోగ్యంతో వృద్ధురాలి బలవన్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని గన్యాగులలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన కురిమ్మంటి బాలమ్మ (60) చాలా రోజులుగా కడుపునొప్పితో బాధపడుతుంది. ఈ క్రమంలో గురువారం మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కుమారుడు మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి


మృతిచెందిన రాజు

జడ్చర్ల: మండలంలోని మాచారం గ్రామం సమీపంలో ఓ దాబా వద్ద జాతీయ రహదారిపై ఈ నెల 21న ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు గాయపడిన వ్యక్తిని వైద్య చికిత్స కోసం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి రాజుగా గుర్తించామని పూర్తి చిరునామా తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

ప్రేయసి మాట్లాడడం లేదని ప్రియుడి ఆత్మహత్య

రాజాపూర్: పొట్ట చేత పట్టుకుని రాష్ట్రాలను దాటి వచ్చి ఓ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం బాలానగర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాలానగర్ ఎస్‌ఐ లెనిన్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఫతేపూర్ గ్రామానికి చెందిన శివప్రతాప్ (20) బాలానగర్ శివారులోని హరిఓం పరిశ్రమలో క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం కడుపునొప్పిగా ఉంది పనికి రాను అంటూ తనతో పాటు రూంలో ఉన్న అన్న ప్రమోద్‌కుమార్‌కు చెప్పిన శివప్రతాప్ ఇంట్లోనే ఉన్నాడు. అనంతరం మిత్రుడు వినయ్‌రాజ్‌పుత్‌కు ఫోన్ చేసి తాను ప్రేమిస్తున్న అమ్మాయి తనతో మాట్లాడడం లేదని, నేను చనిపోతున్నా.. ఇదే చివరి కాల్ అని చెప్పి ఫోన్ కట్ చేశాడు. ఈ క్రమంలో ప్రమోద్, అతడి మిత్రుడితో కలిసి ఇంటి రాగా.. లోపలి గడియ పెట్టుకొని ఉంది. ఇంటి యజమాని అనుమతితో తలుపు తొలగించగా అప్పటికే శివప్రతాప్ చనిపోయాడు. ఘటనపై బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసున మోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సైబర్ వలకు చిక్కిన మహిళ

- రూ.94,500 కాజేసిన వైనం

పాన్‌గల్: సైబర్ నేరగాళ్ల బారినపడి ఓ మహిళ నగదు పోగొట్టుకున్న ఘటనపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని కిష్టాపూర్‌తండాకు చెందిన ముడావత్ బొజ్జమ్మకు వ్యాపార నిమిత్తం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ఖాతా ఉంది. మే 17న గుర్తు తెలియని వ్యక్తులు ఆమెకు ఫోన్‌చేసి ఐగాడ్ గ్లాస్ కార్నర్ నుంచి మాట్లాడుతున్నాం.. ఐ ఫోన్ తక్కువ ధరకు ఇస్తాం, డబ్బులు పంపాలని నమ్మించారు. వారి మాటలు నమ్మి ఆమె రూ.20 వేలు ఒకసారి, రూ.4 వేలు మరోసారి.. మే నెల 22న రూ.35 వేలు, 23వ తేదీన రూ.35 వేలు వారు పంపిన స్కానర్‌కు పంపించింది. ఫోన్ రాకపోవడంతో మోసపోయానని గ్రహించి మే నెల 24న సైబర్ క్రైమ్ పోర్టల్ 1930కి ఫిర్యాదు చేయగా వారు రూ.34,102 హోల్డ్ చేశారు. మొత్తం రూ.94,500 కాజేసిన గుర్తు తెలియని వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గురువారం బొజ్జమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

శ్రావణం.. శుభకరం


మహబూబ్‌నగర్‌లో సామూహిక కుంకుమార్చన పూజలో మహిళలు (ఫైల్)

నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభం
- పండుగలకు నెలవైన మాసం
- శుక్రవారం లక్ష్మీదేవికి ప్రీతికరం


కృష్ణా మండలంలో ఉపనయనాలు నిర్వహిస్తున్న వీరశైవులు (ఫైల్)

అచ్చంపేట/స్టేషన్ మహబూబ్‌నగర్/కృష్ణా: శ్రావణ మాసం.. మహిళలకు ప్రత్యేక మాసంగా చెప్పవచ్చు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఈ మాసంలో మహిళలు మంగళగౌరి, శ్రావణలక్ష్మి (వరలక్ష్మి) పూజలు, పేరంటాలు, వ్రతాలతో ఎంతో సందడిగా గడుపుతారు. అమ్మవారి ఆరాధన, నోములు, వ్రతాలు స్త్రీలకు సకల సౌభాగ్యాలు కలిగిస్తాయని వారి నమ్మకం. లక్ష్మీదేవి జన్మించింది కూడా శ్రావణ మాసంలోనే అని పురాణాలు చెబుతున్నాయి. అలాగే శ్రీమహావిష్ణువు శ్రవణ నక్షత్రంలోనే జన్మించడంతో ఈ మాసం ఆమెకు ప్రీతికరమైందని చెబుతున్నారు. ఈ మాసంలో చేసే అన్ని పూజల్లోకెల్లా వరలక్ష్మి వ్రతం ఉత్తమమైందని.. మొదట ఈ వ్రతాన్ని పరమేశ్వరుడు పార్వతీదేవికి వివరించాడని ప్రతీతి. ఈ వ్రతం చేసిన మహిళలకు సంతానం, ధనధానాలు, సంపూర్ణ ముత్తైదువుతనం, సంతానం, అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని పురాణంలో పేర్కొన్నారు.

వరలక్ష్మి వ్రతం..
వరలక్ష్మీదేవిని ఆవాహనం చేసి సకల ఉపచారాలతో ఈ వ్రతం నిర్వహిస్తారు. ఈ వ్రతంలో తొమ్మిది సంఖ్యకు ప్రాధన్యం. అందుకే తొమ్మిది పోగులతో కూడిన తోరణం ధరించి, తొమ్మిది రకాల పిండివంటలు నివేదన చేసి ముత్తైదువులకు వాయిణమిస్తారు. బూరెలు, బొబ్బట్లు, పులగం, గారెలు, పూర్ణాలు, పరమాన్నం, పులిహోర, రవ్వ కేసరి తదితర పిండివంటల్లో భాగంగా ఉంటాయి.

తిరు నక్షత్ర మహోత్సవాలు..
ఆలయాల్లో అండాళ్ తిరునక్షత్ర మహోత్సవాలు నిర్వహిస్తారు. తొలి శ్రావణ శనివారం సందర్భంగా తులసి అర్చన చేస్తారు.

వివాహాలు, శుభకార్యాలు..
శ్రావణ మాసంలో పెళ్లిళ్లు, గృహప్రవేశాలు, ఇతర శుభకార్యాలు చేసేందుకు ఇప్పటికే ముహూర్తాలు నిర్ణయించుకున్నారు. ఈ నెల 26, 30, 31, ఆగస్టులో 1, 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17లో వివాహ ముహూర్తాలున్నాయి.

శుభ్రత, సాత్వికత, ప్రేమలో...

శుచి, శుభ్రతతో ఉండే ఇళ్లు, తోటి వారితో కలిసిమెలిసి ఉండే వారి ఇళ్లు, పాపపు ఆలోచనలు చేయని, తప్పులు చేయని వారిలో, ప్రేమ, సేవాభావం కలిగిన వారిలో లక్ష్మీదేవి కొలువై ఉంటుందని పురాణాలు చెబుతున్నాయి. లక్ష్మీదేవి కేవలం ధనంగానే కాకుండా ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆయుష్షు, అందం, బంధుగణం, సంపద, సౌకర్యాలు, స్త్రీలు, ఆచారాలు, ఆలయాలు, వస్త్రాలు, విద్య, కళలు, పరికరాలు, పుష్పాలు తదితర అన్ని అంశాల్లోనూ నెలవై ఉంటుందని శాస్త్రాలు పేర్కొంటున్నాయి.

పండుగలకు ప్రత్యేకం..



శ్రావణమాసం పండుగలకు ప్రత్యేకమైందిగా చెప్పవచ్చు. ఈ మాసానికి నభోమాసమని మరో పేరుంది. ప్రతి హైందవుడి ఇంట్లో ఈ నెలంతా పూజలు, వ్రతాలు నిర్వహిస్తుంటారు. ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు, తులసి అర్చనలు, పుష్పార్చనలు, రుద్రాభిషేకాలు తదితర పూజలు చేస్తారు. వర్షాలు కురవాలని శివుడికి ఘృతాభిషేకం చేయడం ఆచారంగా ఉంది.

– తోటపల్లి శ్రీకాంత్‌శర్మ, అర్చకుడు, మహబూబ్‌నగర్

హిందువులకు పవిత్ర మాసం..



హిందువులకు శ్రావణ మాసం అతి పవిత్రమైంది. ఈ మాసంలో శుభ కార్యాలు నిర్వహించుకుంటారు. ప్రతి హిందువు నెలరోజుల పాటు ఇంట్లో పూజలు నిర్వహించడంతో పాటు శుచి, శుభ్రత, పవిత్రత, మడి, ఆచారం, సాంప్రదాయాలకు అనుగుణంగా నడుచుకోవడం, మద్యం, మాంసం ఆరగించకుండా భక్తితో ఉంటారు.

– రాజశేఖర్‌స్వామి, ప్రధాన అర్చకుడు, పార్వతీ పరమేశ్వర దేవస్థానం, చేగుంట (కృష్ణా)

పండుగల మాసంగా..

ఈ నెల 25 నుంచి ఆగస్టు 23 వరకు శ్రావణ మాసం ఉంటుంది. ఈ మాసంలో వచ్చే ఐదు శుక్రవారాలకు విశిష్టత సంతరించుకుంది. జగన్మాత అయిన ఆదిపరాశక్తిని ఈ మాసంలో పలు రూపాల్లో భక్తులు ఆరాధిస్తారు. ప్రధానంగా మహాకాళి, మహాలక్ష్మి, సరస్వతి, త్రిశక్తి, స్వర్ణగిరి స్వరూపమైన అమ్మవారిని మహాగౌరిగా ఆరాధిస్తారు. ముఖ్యంగా ఈ మాసంలో స్వర్ణగౌరి అమ్మవారిని ఎక్కువగా ఆరాధిస్తారు. 29న నాగుల పంచమి, ఆగష్టు 8న వరలక్ష్మి వ్రతం, 9న రాఖీ పౌర్ణమి, 15న కృష్ణాష్టమి, ఆగస్టు 27న వినాయక చవితి ఉన్నాయి. మొదటి శుక్రవారంతో మొదలయ్యే శ్రావణ మాసం వచ్చే నెల 1, 8, 15, 22 శుక్రవారాలు, ఈ నెల 26న, వచ్చే నెల 2 ,9, 16, 23న శనివారం ఉన్నాయి. ఈ నెల 28, వచ్చే నెల 4, 11, 18న సోమవారాలు ఉన్నాయి. ఆయా రోజుల్లో మహిళలు పూజా కార్యక్రమాల్లో నిమగ్నం కానున్నారు. సోమవారం శివుడికి, శుక్రవారం లక్ష్మీదేవికి, శనివారం మహావిష్ణువుకు ప్రీతికరమైన రోజు కావడంతో ఆయారోజుల్లో ప్రత్యేక పూజలు చేస్తారు.

రైతులకు ఇబ్బందులు రాకుండా చూడండి

సాక్షి ఎఫెక్ట్..


జడ్చర్లలో తనిఖీలు నిర్వహిస్తున్న మార్కెటింగ్ జేడీ పద్మహర్ష, తదితరులు

జడ్చర్ల/బిజినేపల్లి/భూత్పూర్: రైతులకు యూరియా ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్లు పద్మహర్ష, హర్ష ప్రభ అధికారులను ఆదేశించారు. గురువారం సాక్షి దినపత్రిలో యూరియా కోసం పడిగాపులు శీర్షికన వచ్చిన కథనంపై వీరు స్పందించారు. ఈ నేపథ్యంలో జడ్చర్లతో పాటు భూత్పూర్ తదితర చోట్ల వేర్వేరుగా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జేడీ పద్మహర్ష డీఏఓ వెంకటేశ్, మార్కెటింగ్ ఏడీ బాలమణి, తదితర అధికారులతో కలిసి స్థానిక గంజ్‌లోని హాకా ఫార్మర్ సర్వీస్ సెంటర్‌తో పాటు ఇతర ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం రైతులతో మాట్లాడి యూరియా, తదితర ఎరువుల లభ్యతపై విచారించారు. బస్తా ధర రూ.267 ఉండగా డీలర్లు రూ.275కు విక్రయించడంపై విచారించారు. హమాలీ చార్జీలతో కలుపుకుని విక్రయిస్తున్నట్లు డీలర్లు వివరణ ఇచ్చారు. అలాగే జేడీ హర్షప్రభ సైతం జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్‌తో కలిసి భూత్పూర్ పట్టణంలోని సింగిల్ విండోతో పాటు ఫెస్టిసైడ్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. మండలానికి ఎరువుల ఎంత మేరకు అలాట్‌మెంట్ చేశారు, ఇప్పటి వరకు ఎంత సరఫరా చేశారు అని జేడీఏ వెంకటేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. భూత్పూర్ మండలానికి 294 టన్నుల యూరియా అలాట్‌మెంట్ చేసి, 249 మెట్రిక్ టన్నుల యూరియాను వివిధ ఎరువుల దుకాణాలకు సరఫరా చేసినట్లు వివరించారు. అలాగే 45 టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉంచినట్లు జేడీఏ వెంకటేష్ వివరణ ఇచ్చారు. ఉదయం 8 గంటల నుంచి పీఏసీఎస్ కేంద్రాల ద్వారా ఎరువులు సరఫరా చేయాలని సీఈవో రవికి సూచించారు. కొన్ని దుకాణాల్లో ఇతర ఎరువులు, మందులు కొంటేనే ఎరువులను విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఏడీ పూర్ణచంద్రారెడ్డికి సూచించారు.

బాలికను కాపాడిన షీ టీం

నాగర్‌కర్నూల్ క్రైం: పెద్దకొత్తపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(14)ను గుంపుమేస్త్రీ నుంచి జిల్లా షీటీం కాపాడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పెద్దకొత్తపల్లి మండలానికి చెందిన ఓ బాలిక తల్లిదండ్రులతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని లక్కవరం పరిధిలో గుంపుమేస్త్రీ కింద పని చేయడానికి వెళ్లారు. కొన్నిరోజుల క్రితం వారు అక్కడి నుంచి సొంతూరుకు వచ్చేయడంతో గుంపుమేస్త్రీ బాలికను పంపించకుండా అక్కడే పెట్టుకున్నాడు. బాలిక తల్లిదండ్రులు నాగర్‌కర్నూల్ షీ టీంను ఆశ్రయించారు. దీంతో కేసును అడిషనల్ ఎస్పీ రామేశ్వర్ సీరియస్‌గా తీసుకొని ఏపీ పోలీసు అధికారులతో మాట్లాడారు. బాలిక ఉన్నటువంటి ప్రదేశానికి పోలీసు బృందాన్ని పంపించి బాలికను రెస్క్యూ చేశారు. గురువారం బాలికను ఎస్పీ కార్యాలయానికి తీసుకొచ్చి బాలల సంరక్షణ అధికారులకు అప్పగించారు.

కానిస్టేబుల్‌పై అట్రాసిటీ కేసు

గట్టు: ప్రేమించిన అమ్మాయిని మోసం చేసిన ఘటనలో చిన్నోనిపల్లె గ్రామానికి చెందిన కానిస్టేబుల్ రఘునాథ్‌గౌడ్‌తో పాటు కుటుంబ సభ్యులు మొత్తం ఏడుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు. చిన్నోనిపల్లె గ్రామానికి చెందిన రఘునాథ్‌గౌడ్ ఖమ్మం జిల్లా పాల్వంచకు చెందిన ప్రియాంకను ప్రేమించి, ఉద్యోగం వచ్చిన తర్వాత పెళ్లికి నిరాకరించాడు. దీంతో ప్రియాంక రఘునాథ్‌గౌడ్ ఇంటి వద్ద ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నిద్రమాత్రలు మింగడంతో ఆమెను గద్వాల ఆస్పత్రికి తరలించారు. ప్రియాంక గట్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మొత్తం ఏడుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఉదండాపూర్ నిర్వాసితులకు రూ.175 కోట్లు

జడ్చర్ల: మండలంలోని ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి ప్రభుత్వం రూ.175 కోట్లు విడుదల చేసినట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ కొల్లాపూర్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారంగా నిర్వాసితులకు దశలవారీగా పరిహారం విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే నిర్వాసిత తండాలకు రూ.40కోట్లు విడుదల చేశారని, తాజాగా వల్లూరు గ్రామానికి రూ.175 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. రూ.200 కోట్లు విడుదల చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి సిఫారసు మేరకు నిధులు విడదలయ్యాయని తెలిపారు. పోలేపల్లి శివారులో పునరావాస కేంద్రంలో నిర్వాసితులకు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. పనులు పూర్తి చేసి త్వరలోనే ఇళ్ల పట్టాలు అందజేస్తామన్నారు. ఇందుకు సంబంధించి కలెక్టర్ ఎప్పటికప్పుడు ఉన్నత స్థాయి సమీక్షలు నిర్వహిస్తున్నారన్నారు.

నాగర్‌కర్నూల్ కలెక్టర్‌కు మాతృవియోగం


కలెక్టర్ సంతోశ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

నాగర్‌కర్నూల్: జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం సూరారం గ్రామానికి చెందిన నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ మాతృమూర్తి బదావత్ శాంతమ్మ(51) గుండెపోటుతో మృతిచెందారు. బుధవారం మధ్యాహ్నం ఆమెకు గుండెపోటు రాగా హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి తర్వాత తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూరారం గ్రామానికి చేరుకుని శాంతమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాగర్‌కర్నూల్ కలెక్టర్ సంతోశ్‌కుమార్‌ను పరామర్శించారు. కలెక్టర్ సంతోశ్‌కుమార్‌ను పరామర్శించిన వారిలో స్టేషన్‌ఘన్‌పూర్, కొల్లాపూర్ ఆర్డీఓ వెంకన్న, బన్సీలాల్ తదితరులు ఉన్నారు. కలెక్టర్ మాతృమూర్తి బదావత్ శాంతమ్మ అకాల మరణంపై జిల్లా అధికారులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

కోర్టుకు హాజరైన తేజేశ్వర్ హత్య కేసు నిందితులు

బెయిల్‌పై న్యాయవాదిని వాకాబు చేసిన ఏ-7


కోర్టులో హాజరైన తర్వాత రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

గద్వాల క్రైం: జూన్17వ తేదీన గద్వాల పట్టణంలోని గంటవీధికి చెందిన ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్ సుపారీ గ్యాంగ్‌చేతిలో దారుణహత్యకు గురైన ఘటన రెండు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన విషయం విధితమే. అయితే గురువారం జిల్లా జైల్‌లో రిమాండ్‌లో ఉన్న నిందితులు ఏ- 1 తిరుమలరావు, ఏ- 2 ఐశ్వర్య అలియాస్ సహస్ర, ఏ -3 కుమ్మరి నగేశ్, ఏ-4 చాకలి పరశురాముడు, ఏ-5 చాకలి రాజు, ఏ-6 ఏ మోహన్, ఏ-7 తిరుపతయ్య(తిరుమల రావు తండ్రి), ఏ-8 సుజాతను గద్వాల జూనియర్ సివిల్ కోర్టు నాయ్యమూర్తి ఉదయ్‌నాయక్ ఎదుట పోలీసులు ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో కేసుకు సంబంధించిన అంశాలపై మరోసారి న్యాయమూర్తి నిందితులతో మాట్లాడారు. జైలు అధికారులు ఏమైనా ఇబ్బందులు, ఆహార పానీయాలు అందించే విషయంలో నిర్లక్ష్యం వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. కేసుకు సంబంధించిన వాదనలకు న్యాయవాదులను ఏర్పాటు చేసుకున్నారా అని ప్రశ్నించారు. అనంతరం నిందితులకు మరో 14రోజుల పాటు రిమాండ్‌కు ఆదేశాలు జారీ చేశారు. పోలీసులు నిందితులను జైలుకు తరలించారు. రిమాండ్‌కు తరలించే క్రమంలో ఏ-7 తిరుపతయ్య తన తరపున ఏర్పాటు చేసుకున్న న్యాయవాదితో బెయిల్ విషయంపై వాకబు చేశారు. నేడో రేపో బెయిల్ బెంచ్ మీదకు వస్తుందని త్వరలోనే బెయిల్ వస్తుందని న్యాయవాది తెలిపారు. నిందితులంతా కోర్టులో హాజరవుతున్నారని తెలుసుకున్న బంధువులు కోర్టు వద్దకు చేరుకుని వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని కన్నీంటిపర్యమయ్యారు.

ఇద్దరు నిందితులను కస్టడీకి కోరిన పోలీసులు
హత్య కేసు ఘటనలో ఇద్దరు నిందితులైన ఏ-1 తిరుమలరావు, ఏ- 2 ఐశ్వర్య అలియాస్ సహస్రను పోలీసులు కస్టడీకి కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఈ విషయంపై త్వరలో న్యాయమూర్తి అనుమతి ఇవ్వనున్నట్లు తెలిసింది. ఈ కేసు వ్యవహారంలో ఈనెల 10న ఏ -1, 3, 4, 5ను మూడు రోజులపాటు వివిధ అంశాలపై విచారణ అధికారి సీఐ శ్రీను విచారించి రిమాండ్‌కు తరలించారు.

మార్మోగిన గోవింద నామస్మరణ


కురుమూర్తి స్వామి దర్శనానికి క్యూలైన్లో నిల్చున్న భక్తులు

కురుమూర్తి గిరులు భక్తులతో కిటకిట

చిన్నచింతకుంట: ఆషాడ మాసం అమావాస్య పురస్కరించుకొని గురువారం పేదల తిరుపతిగా పేరుగాంచిన కుర్తిమూర్తి కొండలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి భక్తులు స్వామి వారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి పునీతులయ్యారు. కొందరు క్యూలైన్‌లో నిల్చొని స్వామి వారి దర్శనానికి వెళ్లగా మరికొందరు మెట్టు మెట్టుకు కుంకుమ పెడుతూ, దీపాలు వెలింగి ముందుకు సాగారు. స్వామివారి దర్శించుకొని పరవశించిపోయారు. కొండపైన అలివేలు మంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయ స్వామి, ఉద్దాల మండపం వద్ద భక్తులు దర్శించుకున్నారు. కొండ దిగువన మట్టికుండలో పచ్చిపులుసు అన్నం నైవేద్యంగా తయారు చేసి స్వామికి సమర్పించారు. అంతకుముందు ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణమంతా భక్తుల రద్దీగా కనిపించింది. జాతరమైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాలల్లో స్వీట్లు, తదితర వస్తువులను కొనుగోలు చేశారు. వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. ఇబ్బందులు లేకుండా ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మధనేశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు బాదం వెంకటేశ్వర్లు ఏర్పాట్లను పరిశీలించారు.

అన్నదాతలు పేర్లు నమోదు చేసుకోవాలి
అన్నదాతలు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి ఈఓ మధనేశ్వర్‌రెడ్డిలు కోరారు. ప్రతి నెల అమావాస్య, పౌర్ణమి, ప్రతి శనివారంను ఆలయం ప్రాగణంలో భక్తులకు అన్నదానం చేస్తునట్లు తెలిపారు. అమావస్యం రోజు అన్నదానం కోసం రూ.25 వేలు, పౌర్ణమి రోజు రూ. 6వేలు,, శనివారం రూ.6వేలు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

నేటి నుంచి శ్రావణ మాసోత్సవాలు

కురుమూర్తి స్వామి ఆలయంలో నెల రోజుల పాటు శ్రావణ మాసోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నెల 25 నుంచి వచ్చే నెల 23 వరకు ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టనున్నారు. వచ్చేనెల 6న లక్ష్మీదేవి అమ్మవారికి కుంకుమార్చన, 7న స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, 8న స్వామివారికి అభిషేకం, పవిత్రారోహణం తదితర కైంకర్యాలు నిర్వహించనున్నారు.


కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


రాజ గోపురం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మన్యంకొండకు 'శ్రావణ శోభ'


మన్యంకొండ దేవస్థానం

- నేటినుంచి విశేషోత్సవాలు ప్రారంభం
- ప్రతిరోజూ శాంతిహోమం, తులసీనామార్చన
- స్వర్ణాభరణ అలంకరణలో దర్శనమివ్వనున్న స్వామివారు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి శ్రావణశోభ రాబోతుంది. ఈనెల 25వ తేదీ నుంచి దేవస్థానంలో శ్రావణమాసపు ప్రత్యేక విశేషోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆగస్టు 28వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. ఇందుకుగాను దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో నెలరోజులపాటు దేవస్థానంలో పలు పూజా కార్యక్రమాలతోపాటు ప్రతిరోజు శాంతిహోమాన్ని నిర్వహిస్తారు. నెలలో ప్రత్యేక దినోత్సవాల రోజుల్లో పలు పూజలు నిర్వహిస్తారు. విశేషోత్సవాల సందర్భంగా స్వామివారిని బంగారు అభరణాలతో అలంకరణ చేసి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి శేషవాహనసేవా నిర్వహిస్తారు. ప్రతి బుధ, గురు, శుక్రవారాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు. అలాగే ప్రతిరోజు వేయి తులసీదళాలతో ప్రత్యేక అర్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

విశేషోత్సవాలు...
దేవస్థానంలో ఈనెల 25వ తేదీన ప్రత్యేక పూజా కార్యక్రమాలతో శ్రావణమాస విశేషోత్సవాలను ప్రారంభిస్తారు. ఈనెల 29న నాగుల (గరుడ పంచమి), ఆగస్టు 5న ఏకాదశి, శ్రీవిష్ణుసహస్రనామ అఖండ పారాయణం నిర్వహిస్తారు. 9న ఉదయం 11 గంటలకు స్వామివారి కల్యాణం (రాఖీ పౌర్ణమి), హయగ్రీవ జయంతి (రాత్రికి శేష వాహన సేవ), 16న శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఉట్ల కార్యక్రమం, శ్రీ హనుమద్దాసుల కీర్తనలతో అఖండ భజన 24 గంటల పాటు జరుగుతుంది. అలాగే 28న గురుపంచమి ఋషిపంచమి సమారాధన, శ్రావణమాస హోమ పూర్ణాహుతి, సమారాధన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు. శ్రావణమాస విశేషోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

జూరాలకు 60 వేల క్యూసెక్కులు


5 క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద గురువారం తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం 67 వేల క్యూసెక్కులు ఉండగా.. గురువారం రాత్రి 7 గంటల సమయంలో 60 వేలకు చేరినట్లు చెప్పారు. దీంతో ప్రాజెక్టు 5 క్రస్ట్ గేట్లు పైకెత్తి 20,530 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 37,465 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315, భీమా లిఫ్ట్-1కు 650, నెట్టెంపాడుకు 750, ఆవిరి రూపంలో 46, ఎడమ కాల్వకు 820, కుడి కాల్వకు 550, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150, భీమా లిఫ్ట్-2కు 750, సమాంతర కాల్వకు 200 క్యూసెక్కులు మొత్తం 61,326 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం జలాశయానికి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.929 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వివరించారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి
ఆత్మకూర్: జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి వేగంగా కొనసాగుతోంది. గురువారం 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ 5 యూనిట్ల నుంచి 195 మెగావాట్లు, 153.785 మి.యూ, దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 183.418 మి.యూ. ఉత్పత్తి చేపట్టామన్నారు. ఎగువ, దిగువ కేంద్రాల్లో ఇప్పటి వరకు 337.203 మి.యూ. చేపట్టామని చెప్పారు. ప్రస్తుతం 38 వేల క్యూసెక్కుల నీటిని విద్యుదుత్పత్తి నిమిత్తం వినియోగించినట్లు తెలిపారు.

సంగంబండలో ఒక గేట్ ఎత్తి..

మక్తల్: సంగంబండ రిజర్వాయర్‌లో నీటి ప్రవాహం అధికంగా కావడంతో గురువారం ఇరిగేషన్ డీఈ సురేష్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి ఒక గేట్ ఎత్తి 500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కర్ణాటక ఇడ్లూర్ పెద్దవాగు నుంచి ప్రవాహం అధికంగా రావడంతో రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గణేష్‌కుమార్, జేఈ భానుచందర్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.


సంగంబండ రిజర్వాయర్ వద్ద నీటి ప్రవాహం